క్లుప్తంగా

అనుమానాస్పద మృతిపై కేసు

సీతానగరం: వంగలపూడికి చెందిన కొయ్యల మూడి సత్యనారాయణ (71) మృతిపై ఆయన బావమరిది నందిపాటి ఉదయ్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు సోమవారం తెలిపారు. సత్యనారాయణకు నాలుగేళ్ల క్రితం గుండెకు సంబంధించి ఇబ్బంది రావడంతో స్టంట్లు వేశారు. అయితే పొలం విషయంలో చుట్టుపక్కల వారితో ఇటీవల ఘర్షణ పడ్డాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు మృతి చెందాడు. ఈ ఘటనపై ఆయన బావమరిది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ఈఓపీఆర్డీగా ఎంఎస్ఎన్‌రెడ్డి



ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సచివాలయ కార్యదర్శులు

పెదపూడి: మండల ఈఓపీఆర్డీగా ఎంఎస్ఎన్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీడీఓ పి.విజయ భాస్కర్, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసుచౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, ఎం.త్రినాథ్, ప్రసన్నకుమార్, స్వామి, చిన్ని తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఎస్ఎన్‌రెడ్డి ఇప్పటివరకూ సామర్లకోటలోని ఐటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో నోడల్ అధికారిగా పనిచేసి పదోన్నతిపై పెదపూడి ఈఓపీఆర్డీగా వచ్చారు.

13న సర్వసభ్య సమావేశం

పెదపూడి: పెదపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.విజయభాస్కర్ సోమవారం తెలిపారు. ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన జరిగే సమావేశానికి వివిధ శాఖాధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: మండలంలోని చంద్రేడులో ఉన్న శ్రీకాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామికి శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి ప్రారంభమైన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



ఊలపల్లిలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలో ఉన్న శ్రీ ముల్లంగి బులివీరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సురక్షలో భాగంగా రంగంపేట పీహెచ్‌సీకి చెందిన కంటి వైద్యులు బి.సుబ్బారావు సుమారు 200 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బోకం లోవకుమారి, ఉపాధ్యాయులు గొలుగూరి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ



మహిళలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి ఏడుకొండలు

గోకవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం గోకవరంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. తొలుత వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం మహిళలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గునిపే ఏడుకొండలు, ఇజ్జిన కిరణ్‌కుమార్, పత్తి రమేష్, మనోహర్‌దాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథం.. స్ఫూర్తిదాయకం

- దూసుకుపోతున్న డ్వాక్రా మహిళలు
- వారి సమస్యలపై ప్రత్యేక దృష్టి
- జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభలు



డ్వాక్రా గ్రీవెన్స్‌లో అక్కచెల్లెమ్మల సమస్యలు వింటున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: స్వయం సహాయక సంఘాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ డ్వాక్రా గ్రూపులను ప్రోత్సహిస్తోంది. నవరత్నాల్లోని పథకాలన్నింటికీ మహిళల పేరిట నిర్వహించడం ద్వారా మహారాణులుగా తీర్చిదిద్దుతోంది. రాజానగరం నియోజకవర్గంలో సంక్షేమ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ పరిశీలించడానికి డ్వాక్రా గ్రూపులకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామాల వారీగా సభలు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని 82 గ్రామ పంచాయతీల్లో 6,538 డ్వాక్రా గ్రూపులున్నాయి. ఒక్కో గ్రూపులో 10 మంది చొప్పున 65,380 మంది సభ్యులున్నారు. కోరుకొండ మండలంలో 1,985, రాజానగరంలో 2,661, సీతానగరంలో 1,892 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి.

గ్రామాల వారీగా

రాజానగరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. డ్వాక్రా సంఘాల్లోని అక్కచెల్లెమ్మల సమస్యలను పరిష్కరిస్తున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలన్న ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, జగనన్న చేయూత తదితర పథకాలను అర్హులకు పూర్తిస్థాయిలో అందించాలనే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుని బ్యాంకుఖాతాలో జమచేస్తున్నారు. తద్వారా దళారుల బెడద లేకుండా అర్హులకే ప్రయోజనం చేకూరుతోంది. సున్నా వడ్డీ పథకం ద్వారా కోరుకొండ మండలంలోని 1,688 గ్రూపులకు చెందిన సభ్యులు రూ.1,31,71,652 లబ్ధి పొందారు. అలాగే వైఎస్సార్ ఆసరా ద్వారా మండలంలోని 1,569 గ్రూపులకు రూ.14,54,06,594 లబ్ధి చేకూరింది. జగనన్న చేయూత పథకం మహిళలను వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతోంది.

రుణ సదుపాయం



డ్వాక్రా గ్రూపు సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తాం. కిరాణా తదితర వ్యాపారాలు, గేదెలు, మేకల పెంపకం కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇస్తున్నాం. మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్నాం.

– జయంతి రాజు, ఏపీఎం

అభివృద్ధికి దోహదం



సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత తదితర సంక్షేమ పథకాలు మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయి. మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు జరుపుతోంది.

– కంటే సుప్రియ, బూరుగుపూడి

చేసిన పాపాల ఫలితంగానే చంద్రబాబు అరెస్ట్



సత్తి రామకృష్ణారెడ్డి

అనపర్తి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో చేసిన పాపాల ఫలితంగానే అరెస్ట్ అయ్యారని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ జీవితం మొత్తం అవినీతిమయమేనని, ఈ మాటలు చంద్రబాబు మామ ఎన్టీఆర్ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. వంద గొడ్లు తిన్న రాబందు ఒక్క గాలి పెట్టుకు కొట్టుకుపోయిందన్న సామెత మాదిరిగా తన పదవీకాలంలో వేల కోట్లు దోచుకుని తప్పించుకున్న చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో జైలు పాలయ్యారని చెప్పారు. అవినీతిలో మాస్టర్స్ చేసిన చంద్రబాబు అరెస్టును రాజకీయ కుట్రగా పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు జైలు జీవితానికి స్కిల్ స్కాం నాంది మాత్రమే అని, ఆయనపై మరో ఏడు కేసులు మిగిలి ఉన్నాయన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల వాయిదా

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో సోమవారం ప్రారంభించాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలను 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాయిదా వేసినట్లు సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని చెప్పారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



గర్భిణులకు చీరలు, పండ్లు అందజేస్తున్న సర్పంచ్ గంగాభవాని తదితరులు

అనపర్తి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని రామవరం సర్పంచ్ గిరడా గంగాభవాని అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఐసీడీఎస్ రామవరం సెక్టార్ పరిధిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మాతాశిశు మరణాల నివారణ, రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అత్యంత పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో రంగంపేట సీడీపీఓ జెస్సీ ఫ్లోరెన్స్, ఎంపీటీసీలు గొలుగూరి గౌతమి, నల్లమిల్లి భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు కర్రి రామచంద్రారెడ్డి, చింతా బుల్లెమ్మాయి, లంక అవ్వమ్మ, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలనాంశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పరిపాలనాపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి జేవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక రివర్‌బే సమావేశ మందిరంలో జిల్లాలోని గ్రేడ్ 1 నుంచి గ్రేడ్–5 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మూడోదశ శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం, 73వ రాజ్యాంగ సవరణ, ఇతర న్యాయపరమైన అంశాలపై కార్యదర్శులు అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా కార్యాలయ మాన్యువల్, ఎన్ఆర్ఈజీఎస్, లేఅవుట్లు అనుమతులు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్వమిత్ర, డ్రాఫ్టింగ్ తదితర అంశాలపై క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కిందిస్థాయి నుంచి జిల్లా, ఆపై స్థాయి వరకు పరిపాలనా అంశాల్లో జరిగే మార్పులను గమనిస్తూ ఉండాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసే జీవోలు, మెమో సర్క్యులర్ల గురించి తెలుసుకోవాలన్నారు.

అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలి



ఫోక్స్‌పేట రేంజ్ కార్యాలయంలో అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న రేంజర్ కరుణాకర్, సిబ్బంది

గోకవరం: జాతీయ అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని ఫోక్స్‌పేట రేంజర్ ఎమ్.కరుణాకర్ అన్నారు. జాతీయ అటవీ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సూదికొండ ఫోక్స్‌పేట రేంజర్ కార్యాలయంలో అటవీ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల ఆశయ సాధనకు సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలన్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సుజాత, సెక్షన్ అధికారులు నూకరాజు దొర, డి.అప్పారావు, సిబ్బంది ప్రశాంత్, జగదీష్, మాణిక్యం, పద్మ, అరుణ, సుభద్ర, శ్రీను, మనోహర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



బూరుగుపూడిలో ఎన్టీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి పీఏసీఎస్ ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు కంటే వినయ్ తేజ సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు శిక్షణ పేరుతో రూ.కోట్ల అవినీతికి చంద్రబాబు పాల్పడడం దారుణమన్నారు. పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఉల్లి గణ, జిల్లా ఉపాధ్యక్షుడు చింద్రం శ్రీహరి, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏడిద పండు, బేదంపూడి అరుణ్, చొంగా వెంకటేశ్వరరావు, ఇంజే విజయకుమార్, పసుపులేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ బంద్ విఫలం



సీతానగరంలో యథాతథంగా తిరుగుతున్న ఆర్టీసీ బస్సు

రాజానగరం/సీతానగరం/మధురపూడి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గంలో సోమవారం చేపట్టిన బంద్ విఫలమైంది. టీడీపీ, జనసేన, కమ్యూనిస్టు పార్టీ నాయకులు వచ్చిన దుకాణాలను, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి చేసినప్పటికీ పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. ఆటోలు, బస్సులు యథాతథంగా తిరిగాయి. ముందు జాగ్రత్తగా ప్రైవేట్ పాఠశాలలకు మాత్రమే సెలవు ప్రకటించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో రాజానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు టీడీపీ శ్రేణులు ధర్నా చేపట్టాయి. సీతానగరంలో ఉదయం 10 గంటల నుంచి బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు యథావిధిగా పనిచేశాయి. టీడీపీ శ్రేణులు సీతానగరం బస్టాండ్ వద్దకు చేరుకుని బస్సులను నిలిపివేశారు. ఎస్సై కె.చిరంజీవి తన సిబ్బందితో చేరుకుని బస్సులను ఆపరాదని చెప్పారు. కోరుకొండ మండలంలోనూ బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. ప్రజలు తమ కార్యక్రమాలను యథాతథంగా నిర్వహించుకున్నారు.

గోకవరం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ చేపట్టిన బంద్ సోమవారం గోకవరంలో పాక్షికంగా జరిగింది. ఉదయం టీడీపీ నాయకులు ఆర్టీసీ డిపో వద్ద కొద్ది సేపు బస్సులను అడ్డుకున్నారు. అనంతరం బస్సులు యథావిధిగా నడిచాయి. ప్రైవేటు విద్యాసంస్థలు మూతబడ్డాయి. వారపు సంత యథావిధిగా కొనసాగింది.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో సోమవారం బంద్ పాక్షికంగా జరిగింది. పెదపూడి, శహపురం, జి.మామిడాడ, కరకుదురు, రామేశ్వరం తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మూయించి వేశారు. కాండ్రేగుల, సంపర, దోమాడ తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి.

తక్కువ ఖర్చుతో ఇంటిలోనే పౌష్టికాహారం

రాజమహేంద్రవరం రూరల్: తక్కువ ఖర్చుతో ఇంటిలోనే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ టీఎంవో వైహెచ్ మరియ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా హుకుంపేట డి బ్లాకులోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఇంటి వద్ద లభించే దినుసులతో పౌష్టికాహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఏ.విజయలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు.

మాజీ సైనికులకు అండగా నిలుస్తాం

- కలెక్టర్ మాధవీలత
- కలెక్టరేట్‌లో జిల్లా సైనిక సంక్షేమ బోర్డు సమావేశం



జిల్లా సైనిక సంక్షేమ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని సైనికులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి సంక్షేమం కోసం ప్రతిపాదించిన అంశాలపై సానుకూలంగా స్పందించే విధానంలో ఆయా శాఖలకు మార్గదర్శకాలు జారీ చేస్తామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా సైనిక సంక్షేమ బోర్డు సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైనిక సంక్షేమ శాఖ ప్రతిపాదించిన అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ సైనికులు మాట్లాడుతూ ఇంటి పన్ను మినహాయింపు, వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న పథకాలలో మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రభుత్వ, మునిసిపల్ దుకాణాల్లో షాపులను కేటాయింపులు జరపాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనలో మాజీ సైనిక కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వృత్తి విద్యా కోర్సుల్లో అవకాశాల కల్పనకు ఉత్తర్వులు జారీ చేయాలని, పారిశ్రామిక రంగంలో తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని కోరారు. రాజమహేంద్రవరంలో సైనిక సంక్షేమ భవన నిర్మాణానికి ఆరు సెంట్ల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కాగా.. సైనిక సంక్షేమ బోర్డు ప్రతిపాదించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని, ప్రాధాన్యతా క్రమంలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి సార్జెంట్ పి.సత్య ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కల్నల్ గంటా చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ వినతి

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు విధి నిర్వహణలో ఎటువంటి ఆటంకాలు కల్గించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మాధవీలతకు ఏపీపీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, కోశాధికారి డాక్టర్ శ్రీనివాస్, 20 మంది వైద్యులు సోమవారం సాయంత్రం కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. గత నెల 21వ తేదీన రంగంపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వైద్యాధికారి లావణ్యకు జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

మర్రిపూడికి రాని ఎత్తిపోతల నీరు

- 3,000 ఎకరాల చివరి ఆయకట్టుకు మొండిచేయి
- నీరందించాలనే విషయమే మరిచిపోయిన అధికారులు



చాగల్నాడు ఎత్తిపోతల పథకం

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలం మొత్తానికి సాగునీరు అందించడానికి రూ.80 కోట్లతో చాగల్నాడు ఎత్తిపోతల పథకం నిర్మించారు. పథకం ద్వారా ఏడాది కాలంగా మర్రిపూడి, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు తదితర శివారు గ్రామాలకు నీరందడం లేదు. ఆయా గ్రామాల్లో సుమారు 3,000 ఎకరాలకు పైగానే సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట కాలువ పూడ్చేయడం వల్లేనా..?

వడిశలేరు నుంచి పెదరాయవరం, వెంకటాపురం, దొడ్డిగుంట మీదుగా మర్రిపూడికి 21 కిలోమీటర్ల పొడవున పంట కాలువ నిర్మించారు. కొద్దికాలం పాటు సక్రమంగా నీరందించినా తరువాత శివారు గ్రామం కావడంతో నీటి సరఫరా జరగలేదు. ఎత్తిపోతల అధికారులు కూడా మర్రిపూడికి నీరందించాలనే విషయమే మర్చిపోయారు. ఈ ఏడాది జులై 15న చాగల్నాడు పథకం ద్వారా నీటిని విడుదల చేసినా ఇంతవరకూ వడిశలేరు, రంగంపేట గ్రామాలకు తప్ప మర్రిపూడితో సహా వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు తదితర శివారు గ్రామాలకు నీరు చేరలేదు. నీరు లేక సుమారు 3,000 ఎకరాలకు పైగానే పొలాలు బీళ్లు వారుతున్నాయి. దీనిపై ఆయకట్టు రైతులు ఎత్తిపోతల అధికారులను నిలదీశారు. పెదరాయవరం వద్ద ఓ రైతు తనకు నష్టపరిహారం అందక పంట కాలువను 15 మీటర్ల వెడల్పు, 450 మీటర్ల పొడవునా పూడ్చివేసినట్లు తమకు తెలిసిందని చెప్పి చేతులు దులిపేసుకున్నారే సమస్య పరిష్కారానికి చర్యలు కరవయ్యాయి. దీనికి తోడు ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రంగంపేట వద్ద కొంతమేర కాలువ వ్యవస్థను ధ్వంసం చేశారు. దీనివల్ల కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. చాగల్నాడు డీఈ ఆనందబాబు ఇటీవల వాహన ప్రమాదానికి గురికావడంతో పట్టించుకునేవారు కరవయ్యారు. చాగల్నాడు ఎత్తిపోతల సమస్యలు పరిష్కరించి వెంటనే మర్రిపూడి, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి తదితర గ్రామాలకు నీరందించాలని మండల సాగునీటి సాధన కమిటీ సభ్యులు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి



రాజమహేంద్రవరంలో జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఆధ్వర్యంలో జరిగే నీటి పారుదల సలహా మండలి సమావేశంలో చాగల్నాడు ఎత్తిపోతల పథకం నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలి. రంగంపేట మండలంలో శివారు గ్రామమైన మర్రిపూడికి యుద్ధ ప్రాతిపదికన సాగు నీరందించి రైతులను ఆదుకోవాలి.

– పుట్టా సోమన్న చౌదరి, ఆయకట్టు రైతు, మర్రిపూడి

ఈ ఏడాది ఇంకా నీరందలేదు



చాగల్నాడు ఎత్తిపోతల పథకం మెట్ట ప్రాంతమైన రంగంపేట మండల రైతుల ఆశాజ్యోతి. అకారణంగా పంటకాలువను ఎవరో పూడ్చివేయడం వల్ల వేలాదిమంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. మా గ్రామానికి చాగల్నాడు ఎత్తిపోతల నీరు అందలేదు. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి.

– అంబటి రామకృష్ణ, కౌలురైతు, దొడ్డిగుంట

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న ఆర్‌డీఓ చైత్రవర్షిణి

సీటీఆర్ఐ: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు నుంచి 13 అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, సూపరింటెండెంట్ జి.పాండురంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనకు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చైత్రవర్షిణి అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ డిజినల్ అధికారులతో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్డీఓ చైత్రవర్షిణి మాట్లాడుతూ ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందన, జేకేసీ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.